02042025-MAI-06_Layout 1 4/2/2025 2:27 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# పచ్చదనం పైకి బుల్డోజర్లు

*ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆవరణలోని అడవిపై యంత్ర భూతాలు విరుచుకుపడ్డ తీరు హేయం. తెలుగువారికి అతి ముఖ్యమైన ఉగాది పండుగ రోజు పోలీసు పహారాలో బుల్డోజర్లు పచ్చని చెట్లను ఎడాపెడా నరికివేయడం విచారకరం. అటు పోలీసు క్యాంపులా మారిన క్యాంపస్‌లో విద్యార్థులపై విరుగుతున్న లాఠీలు మరో భయానక దృశ్యం. విద్యార్థులను జుట్టు పట్టి ఈడ్చుకెళ్లడం, చితకబాదడం ఏ తరహా ప్రజా పాలనో? రాత్రికి రాత్రే 400 జేసీబీలను మోహరించడం దేనికి? 'అసలక్కడ అడవే లేదు, పశుపక్ష్యాదుల సంచారమే లేదు' అంటున్నది రేవంత్ సర్కారు. మరి కూలుతున్న ఆ చెట్లు ఎక్కడివి? చెల్లాచెదురవుతున్న పిట్టలను అడగండి.. అది అడివో కాదో! పరుగులు తీస్తున్న నెమళ్ల ఆర్తనాదాలు వింటే తెలుస్తుంది ఎవరి గూడు చెదిరిపోతున్నదో? జేసీబీ చక్రాల్లో చిక్కుకున్న జింకపిల్ల కళేబరం సాక్షిగా అక్కడ ప్రకృతి హననం జరుగుతున్నది.*

*తెలంగాణ తొలిదశ ఉద్యమ పర్యవసానంగా కేంద్రం రూపొందించిన ఆరు సూత్రాల పథకంలో భాగంగా హైదరాబాద్ వర్సిటీ ఏర్పడిందన్న సంగతి తెలంగాణ సోయి లేని సీఎం రేవంత్‌కు తెలుసా? 2300 పైచిలుకు ఎకరాల్లో ఏర్పడిన ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయం చుట్టూరా పరుచుకున్న అడవిలో దక్కన్ పీఠభూమి భౌగోళికతకు ప్రతీకగా నిలిచే రాతిగుండ్ల అమరికలు దండిగా ఉన్నాయని తెలుసా? వాటిని కాపాడేందుకు 'సేవ్ రాక్ సొసైటీ' వంటి పౌర సమాజ సంస్థలు పాటుపడుతున్నాయనే అవగాహన కించిత్తయినా ఉందా? చివరి గణన ప్రకారం ఆ అడవిలో 734 వృక్షజాతులు, 10 రకాల క్షీరదాలు, 15 రకాల సరీసృపాలు, 220 రకాల పక్షిజాతులు మనుగడ సాగిస్తున్నాయనే స్పృహ ఉందా? చితాల్ దుప్పి, కుందేళ్లు, ఏదు పందులు, అడవిపందుల ఆవాసం ఆ ఆడవి. బృహత్ శిలాయుగానికి చెందిన రక్షిత ప్రదేశం అక్కడే ఉంది.*

*ఇక్కడ రెండు అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి పర్యావరణం. రెండు, విద్యార్థుల హక్కులు. ఈ రెండూ సర్కారు ప్రాధాన్యాల్లో ముందువరసలో ఉండాలి. ఆదాయం పెంచుకోలేక చతికిలపడుతున్న సర్కారు భూములను తెగనమ్మి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నది. ఎక్కడ ఏ అవాంతరం వచ్చిపడి భూముల వేలం ఆగిపోతుందోననే బెదురు సర్కారులో స్పష్టంగా కనిపిస్తున్నది. భూమి తనకే చెందుతుందని సర్కారు భావిస్తూ ఉండవచ్చు. ఆ సంగతి తేల్చడానికి కోర్టులున్నాయి. పోనీ అక్కడ ఏదైనా ప్రజోపయోగ ప్రాజెక్టు కడుతున్నారా? అంటే అదీ లేదు. ఏదో వాణిజ్య ప్రాంతం మధ్యలో చిన్న చిన్న సర్కారీ ప్లాట్లు వేలంలో అమ్మడం షరామామూలే. కానీ ఇక్కడున్నది ఓ విద్యాసంస్థలో భాగమైన 400 ఎకరాల పైచిలుకు పచ్చని భూమి. నగరం మధ్యలో వెలుగుతున్న ఆకుపచ్చని దీపాన్ని ఆర్పాలన్న ఆత్రం ప్రశ్నార్థకమవుతున్నది. నగరజీవికి ఊరటనిచ్చే ఆకుపచ్చని ఊపిరితిత్తులను ఛిద్రం చేయడానికి అంత దూకుడు ఎందుకు? కేసీఆర్ హయాంలో హరితహారం పేరిట అడవిని పెంచి చూపింది. కానీ, చిన్న మొక్కయిన నాటని రేవంత్ సర్కారు ఒక పెద్ద అడవినే పెరికి కుప్పలు పోస్తున్నది. హరితావరణంపైకి గొడ్డళ్లు విసురుతున్నది. దివాళాకోరు భూమి అమ్మకాల కోసం దిక్కుమాలిన వేలానికి ఉరుకులాడుతున్న సర్కారుకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు.*

# మరోసారి అటకెక్కిన బీసీ కోటా!

**ప్రజాస్వామ్యం ముసుగులో నడుస్తున్న నిచ్చెనమెట్ల కులస్వామ్యంలో దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏండ్లు గడుస్తున్నప్పటికీ బీసీ కులాలు పాలకుల చేతుల్లో నయవంచనకు గురవుతూనే ఉన్నాయి. ఇందుకు నిదర్శనంగా ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీ కోటాను 42 శాతం వర్గీకరణతో అమలుచేస్తామని చెప్పింది. అందులో భాగంగా రెండు బీసీ బిల్లులను ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతుతో ఏకగ్రీవంగా శాసనసభ, శాసనమండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించి మరోసారి బీసీ రిజర్వేషన్లను పద్ధతి ప్రకారం అటకెక్కించింది.**



**కోడెపాక కుమారస్వామి**
**94909 59625**

బీసీ సంఘాలను, మేధావులను మొత్తం బీసీ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే ఇది. రాజ్యాంగంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లోని లోపాల ఆధారంగా వెలువడుతున్న సుప్రీం కోర్టు తీర్పులు బీసీ కులాలకు శాపంగా మారాయి. రాజ్యాంగంలో వెనుకబడిన కులాలను కాస్త వెనుకబడిన తరగతులుగా (Backward Classes), వెనుకబడిన పౌరులుగా (Backward Citizens) చిత్రీకరించిన పరిస్థితి. ఇప్పటికిప్పుడు బీసీ కోటా 42 శాతం అమలుచేయలేమనేది కాంగ్రెస్ పెద్దలకు తెలియని అంశం కాదు.

> **కాంగ్రెస్ సార్వత్రిక ఎన్నికల కంటే ముందు బీసీ కోటా 42 శాతానికి పెంచి వర్గీకరణ ద్వారా అమలుచేస్తామని బీసీ ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలించినట్టయితే, సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం 2010లో కె.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసు తీర్పులో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేకమైన మూడు నిబంధనలను పెట్టింది. వాటిలో మొదటిది, వెనుకబడిన తరగతుల పౌరుల వెనుకబాటుకు సంబంధించి ప్రత్యేక బీసీ కమిషన్ ద్వారా ఆమోదయోగ్యమైన లెక్కలు తీయాలి.**

రెండవది, ఆ లెక్కల ద్వారా బీసీ కోటాను నిర్ధారించాలి. మూడవది, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లతో కలిపి 50 శాతం నిలువు రిజర్వేషన్లు దాటకూడదని తెలిపింది. ఇదే తీర్పులో అసలు సామాజికంగా వెనుకబడిన తరగతుల జాబితా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు, స్థానిక సంస్థల్లో వెనుకబడిన పౌరుల జాబితా వేరుగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుబట్టింది. ఎందుకంటే భారత రాజ్యాంగం ఆర్టికల్ 15 (4), 15 (5), 16(4) ప్రకారం బీసీ కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారు. అదే స్థానిక సంస్థల్లో ఆర్టికల్ 243 ప్రకారం బీసీ కులాలను వెనుకబడిన పౌరులుగా గుర్తించారు. భారత రాజ్యాంగంలో బీసీ కులాలను గుర్తించేవిధంగా అధికరణలు లేకపోవడం నేడు బీసీ కులాల పాలిట శాపంగా మారింది. ఈ సమస్యలన్నీ పాలకులకు తెలియనివి కావు. సుప్రీంకోర్టు 2021లో మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వికాస్ కిషన్‌రావు గవలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసు తీర్పులో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటే ట్రిపుల్ టెస్ట్ ద్వారానే అమలు చేయాలని, లేనట్లయితే బీసీ రిజర్వేషన్లు లేకుండానే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.



2022లో సుప్రీం కోర్టు సురేశ్ మహాజన వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసు తీర్పులో మధ్యప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ట్రిపుల్ టెస్ట్ ద్వారానే స్థానిక సంస్థల్లో బీసీ కోటా అమలు చేయాలని, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని, బీసీ గణాంకాలు లేకపోతే బీసీ రిజర్వేషన్లు అమలుచేయవలసిన అవసరం లేదని, ప్రతి ఐదేండ్లకు రాజ్యాంగ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో సహా దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాలను 2022లో సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. అంటే 2022 నుంచి దేశంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటా అమలుచేయాలంటే బీసీ గణాంకాలు తప్పనిసరి, అదే విధంగా మొత్తం నిలువు రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ కోటాతో కలిపి 50 శాతానికి మించి అమలుచేసే అవకాశం లేదు. అందులోభాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కులగణన చేసి బీసీ జనాభాను 56 శాతంగా తేల్చింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా అమలు చెయ్యడం కోసం, సుప్రీం కోర్టు 1992లో 9 మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ తీర్పులో ప్రధానంగా నిలువు రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిబంధన విధిస్తూనే, ఒకవేళ బీసీ గణాంకాలు ఆమోదయోగ్యంగా ఉండి ప్రత్యేక పరిస్థితులు, బీసీల ప్రాతినిధ్యం లేనట్టయితే 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లు అమలు చేసుకోవచ్చని అదే తీర్పులో తెలిపింది. ఇదిలా ఉంటే గత బీఆర్ఎస్ 2022లో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచడం వల్ల నిలువు రిజర్వేషన్లు విద్య, ఉదోగాల్లో 54 శాతానికి చేరుకున్నది. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా తో కలిపి 64 శాతానికి చేరుకున్న విషయం అందరికీ విదితమే.

భారత రాజ్యాంగ సమాఖ్య సిద్ధాంతం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను నిర్ధారించి అమలుచేసుకోవాలి. అంతేగానీ ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను అమలుచేసి బీసీ కులాలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా వెంటనే అమలుచెయ్యాలి. ఒకవేళ హైకోర్టు, సుప్రీంకోర్టులో ఎవరైనా కేసులు వేసినట్టయితే, ఆ కేసులను బీసీ కులాల విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యాల లెక్కలను కోర్టుల ముందు ఉంచి నెగ్గే ప్రయత్నం చేయాలి. లేనట్టయితే, సమాజం కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితులు లేవు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్లపై న్యాయ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని భారత రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం ఉన్నది. రాజ్యాంగంలో విద్య, ఉద్యోగ ఇతర అంశాలకు సంబంధించిన అధికరణల్లో బీసీ తరగతులను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లో కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి లేదా బీసీ కులాలు ఓట్ల విప్లవం, రాజకీయ ప్రక్రియ ద్వారా ద్రవిడ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికారంలోకి రావాలి. లేనట్టయితే దేశంలో బీసీ రిజర్వేషన్ల అమలు ప్రశ్నార్థకమే.

**(రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం)**

# బీజేపీని వణికిస్తున్న గ్రోక్

**విమర్శను స్వీకరించటానికి సిద్ధంగా లేని బీజేపీ లాంటి పార్టీ పాలిస్తున్న మన దేశంలో గ్రోక్ సంచలనం రేపుతున్నది. క్రికెట్, సినిమాలు, రాజకీయాలు ఇలా ఏ అంశమైనా తనదైన శైలిలో సమాధానాలు చెప్తున్నది. ముఖ్యంగా బీజేపీకి చురకలంటించడంలో 'గ్రోక్' ముందున్నది.**



**పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాపైన సెటైర్లు వేస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్లున్న 'గ్రోక్' ఎలాన్ మస్క్ నేతృత్వంలో పనిచేస్తున్నది. ప్రధాని డిగ్రీ అర్హతపై కామెంట్లు చేసిన 'గ్రోక్'పై చర్యలకు కేంద్రం సిద్ధపడుతున్నది. దీనిపై కూడా గ్రోక్ చెప్పిన సమాధానం చదివితే మనం ఆశ్చర్యపోవాల్సిందే. భారత్‌లో ఈడీ, సీబీఐ అంటే పెద్ద తలనొప్పని, కానీ, నేను కృత్రిమ మేధను మాత్రమేనని, తాను తనిఖీలకు భయపడబోనని చెప్పింది. 'గ్రోక్' ఈ సమాచారన్ని ఎక్కడి నుంచి తీసుకొస్తున్నదంటే శాస్త్రవేత్తలు ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాథమిక సూత్రాలు, సత్యాలతో శిక్షణనిచ్చారు. ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీ మద్దతుదారులను ఆందోళనకు గురిచేస్తున్నది. గత పదేండ్లలో ఎవరూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, నరేంద్ర మోదీని విమర్శించటానికి ధైర్యం చేయలేకపోయారు. ఒకవేళ ఎవరైనా విమర్శించినా వెంటనే వాళ్ల మీద ఈడీ దాడులు, సీబీఐ కేసులు నమోదయ్యేవి. కానీ, ఈ దేశంలో ఎవరూ చేయలేని పనిని 'గ్రోక్' చేస్తున్నది. మిగతా ఏఐలతో పోల్చితే 'గ్రోక్' కాస్త వైవిధ్యంగా భిన్నంగా సమాధానాలివ్వటం వల్లే దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. వివాదాస్పదమైన అంశాల మీద కూడా ఎలాంటి సంకోచం లేకుండా 'గ్రోక్' స్పందిస్తుండటం కొన్ని రాజకీయపార్టీలకు నచ్చడం లేదు.

ముఖ్యంగా 'గ్రోక్' ఎక్స్ (అంతకుముందు ట్విట్టర్) ఆధారంగా పనిచేయటం వల్ల ఎక్స్‌లో జరిగే రాజకీయ చర్చల నుంచే సమాధానాలను తయారుచేయటం మనం గమనించవచ్చు. అందుకే, దూషణలు, సెటైర్లు లాంటి సమాధానాలు మనకు 'గ్రోక్'లో కనిపిస్తున్నాయి. దేశంలోని ప్రజల కంటే ఎక్కువ భావప్రకటన స్వేచ్ఛ 'గ్రోక్'కు లభించిందని చెప్పక తప్పదు. దేశంలో తప్పుడు సమాచార మార్పిడిని సవివరంగా తెలియజేస్తున్న 'గ్రోక్'పై చర్యలకు ఐటీ శాఖ సమాయత్తమవుతున్నది. ప్రస్తుతం స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాపై జరుగుతున్న వివాదంతో పోలిస్తే గ్రోక్ వంద రెట్లు ఎక్కువగా సెటైర్లు వేస్తున్నది. ఒకప్పుడు సమాచార వ్యాప్తిపై ఉన్న నియంత్రణ ఇప్పుడు పూర్తిగా తొలగిపోయినట్లయ్యింది. ఎలాంటి ఫిల్టర్లు, నియంత్రణ లేకుండా పనిచేస్తున్న 'గ్రోక్'పై కేంద్రం నిషేధం విధించటానికి ఎంతో సమయం పట్టదు. గతంలో గూగుల్‌కు చెందిన జెమిని నరేంద్ర మోదీని ఫాసిస్టు అని వ్యాఖ్యానించిన కేసులో క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. కేంద్ర ఐటీశాఖ సైతం అన్ని సామాజిక వేదికలు వివక్ష, బెదిరింపులు, ఎన్నికల సమగ్రతను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని అప్పట్లోనే ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ఎక్స్ కర్ణాటక హైకోర్టులో కేంద్రంపై కేసు వేసింది. ఇంటర్నెట్ సెన్సారింగ్ చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించింది. ప్రభుత్వాధికారులు, మంత్రులు తమ సోషల్ మీడియా వేదికల్లోని సమాచారాన్ని తొలగించేలా ఐటీ చట్టాన్ని ఉపయోగించి ఆదేశాలు జారీచేయటం చట్ట విరుద్ధమని పేర్కొన్నది. ఐటీ చట్ట ప్రకారం ఏదైనా సమాచారాన్ని తొలగించాలంటే న్యాయ సమ్మతమైన విధానాలు మాత్రమే ఉపయోగించాలి. కానీ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(బీ) ద్వారా సహాయోగ్ పోర్టల్ ద్వారా ఆదేశాలు నేరుగా జారీచేయటం చట్టవిరుద్ధమన్నది ఎక్స్ వాదన. తమను సహాయోగ్ పోర్టల్‌లో చేరమని బలవంతం చేయటం సరికాదని చెప్తున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి నిజ నిర్ధారణ చేయటంపై ఆధారపడటం అంత సరైంది కాదు. ఎందుకంటే, అవి కేవలం యూజర్స్ అడిగిన ప్రశ్నలకు అనుగుణంగా, అదే యూజర్‌కు నచ్చేలా శిక్షణ పొందిన వ్యవస్థలు మాత్రమే. దేశంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని, ప్రజల స్వేచ్ఛను కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే 'గ్రోక్' అవసరం ప్రజలకు రాదు. కానీ, ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ అహంకారంతో, అణచివేతతో వ్యవహరించాలనుకుంటే 'గ్రోక్' లాంటి ఏఐ చాట్‌బాట్‌లు సెటైర్లతో కూడిన సమాచారాన్ని ఇస్తూనే ఉంటాయి. అందుకు భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉండాల్సిందే.




**(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)**

# పంట గొంతులో తడారుతున్నది

**తెలంగాణ రైతు గోస పడుతున్నాడు. ఎండిన పంటలను చూసి కన్నీరు పెడ్తున్నాడు. ఒకటి కాదు, రెండు కాదు, లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. పొట్ట మీదికొచ్చిన పంటకు నీళ్లందక ఎండిపోవటంతో మేకలు, గొర్లు, బర్లు, జీవాలు మేస్తున్నాయి. దేశాని ధాన్యాగారంగా నిలిచిన తెలంగాణ పంటలెండి తల్లడిల్లిపోతున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వరి పంటలో ముందుంటే ఇందులో సూర్యాపేట జిల్లా అగ్రస్థానంలో ఉన్నది. రెండో పంటకు నీళ్లిస్తామంటేనే వరి వేశారు. కానీ, చివరి రెండు తడులకు నీళ్లివ్వమని రైతులు ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని క్షేత్రస్థాయిలోకి వెళ్లిన అధ్యయన బృందానికి కండ్లకు కట్టినట్టు కనిపించింది. రైతుల గోస చూసి తట్టుకోలేక మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కన్నీరు మున్నీరైన తీరును క్షేత్రస్థాయిలో ఎండిన భూములు దృశ్యరూపకంగా ధ్రువపరుస్తున్నాయి.**



**జూలూరు గౌరీశంకర్**

చివ్వెంల మండలం మొగ్గాయి గూడెం గ్రామానికి చెందిన రైతు కొనకంచి వీరభద్రయ్య పదెకరాలు వరి పంట వేస్తే ఎండిపోయింది. ఎకరానికి 30 వేల చొప్పున పెట్టిన పెట్టుబడి పోయింది. నీళ్లు లేకపోవటంతో 35 వేలు పెట్టి రెండు బోర్లు వేస్తే నీళ్లు పడలేదు. మరో రైతు మర్రు వినయ్ ఏడెకరాలు మర్రు గోపాలరావు దగ్గర కౌలుకు తీసుకున్నాడు. రణబోతు వీరారెడ్డి అనే రైతు నారాయణరెడ్డి, సురేష్ రెడ్డిల దగ్గర భూమి కౌలుకు తీసుకొని పంటలేస్తే అందరి పొలాలు పొట్టదశకు వచ్చాక నీళ్లందక ఎండిపోయాయి. 300 ఫీట్లు లోతుకు పోయినా ఒక్క బోరులో కూడా చుక్క నీళ్లు పడలేదు. పచ్చగా పొట్ట మీది పంటతో నిండుగా కనిపించాల్సిన పొలాలు, వరి కంకుల మొదళ్లు వంగిపోయి వాలిపోయి నేలకూలాయి. గతేడాది ఏసంగి కళకళలాడిన పంటలు ఈ ఏడాది నీళ్లులేక వరి కంకులు ప్రాణాలొదిలినట్టు కనిపిస్తున్నాయి. వారబందీ పద్ధతుల్లో నీళ్లిస్తామని నీటి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారని రైతులు అధ్యయన కమిటీ సభ్యులు జూలూరు గౌరీశంకర్, సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్, వీరయ్య, ఐవీ రమణారావు, ఉపేంద్రలకు చెప్పారు. 'వ్యవసాయాధికారులు, ఎంఆర్ఓలు, ఆర్‌డిఓలు ఎవరూ మా పంట నష్టాన్ని చూడటానికి రాలేదు, ఏ నాయకుడు రాలేదని గ్రామ రైతులు చెప్తున్నారు. ఎంత మొత్తుకున్నా మా గోస ఎవరూ వినలేదు. ఒక్క రెండు తడులు వస్తే బయట పడేవాళ్లమంటున్నారు. అప్పులు తెచ్చి మెడలోని బంగారం తాకట్టు పెట్టి బోర్లు వేస్తే ఒక్క చుక్క రాకపాయె' అని రైతులు బావురుమంటున్నారు. మొత్తం మొగ్గాయి గూడెంలో 50 మంది రైతులున్నారు. అందరూ దెబ్బతిన్నారు. ఆ ఊర్లో ఎండని పొలం లేదు. ఏడ్వని ఇల్లు లేదు.

పెన్‌పహాడ్ మండలం రేక్యాతండ గ్రామానికి వెళ్తే ఎటుచూసిన ఎండిన పొలాలు కనిపిస్తున్నాయి. రేక్యాతండ గిరిజన గ్రామంలో 30 మంది రైతులుంటే 250 ఎకరాల భూమి ఉన్నది. 200 ఎకరాలు ఎండిపోయాయి. గత సంవత్సరం పరిస్థితి చూస్తే నీళ్లు ఎక్కువై కోత మిషన్లు తిరగటం కష్టమైందని రైతులు చెప్తున్నారు. పంటలు ఎండి మరోదారి లేక 50 కుటుంబాలు ఊరి నుంచి వలసపోయి ఇతర ప్రాంతాలలో దిన కూలీలుగా పనిచేస్తున్నారు. నార్కట్‌పల్లిలో సీసీ రోడ్డు పనుల్లో, చౌటుప్పల్, చిట్యాలలో దిన కూలీలుగా వలసపోయారని ఊర్లో మిగిలిన ఆ కుటుంబీకులు చెప్తున్నారు. 250 ఎకరాలు భూమికి 200 బోర్లు వేసినా అవన్నీ ఫెయిలయ్యాయి. ఒక్కొక్క బోరుకు రూ.35 వేలు ఖర్చు చేశారు. ఆ ఒక్క గ్రామంలోనే రూ.2 లక్షలు బోర్లకు వెచ్చించారు. రెండెకరాలు, మూడెకరాలు పంటలు వేసిన భూక్యా చినదూబ్లా, భూక్యా శంకరు, భూక్యా కైకా, ఆంగోతు శ్రీరాములు దీనస్థితికి నెట్టబడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొస్తే బిడ్డకు వరకట్నం ఇద్దామనుకున్నానని భూక్యా కైకా విలపిస్తున్నది. తమ ఊరికి కలెక్టర్ తేజశ్రీ నం దలాల్ పవార్ వచ్చి చూశాక ఒక తడికి మాత్రం నీళ్లు వచ్చాయని ఆ తర్వాత నీళ్లు రాలేదని చెప్తున్నారు. 'గత ఐదేండ్ల నుంచి మాకు నీళ్ల బాధలేదు. ఇప్పుడు నీళ్లు లేక గోస పడుతున్నాం. నీళ్లు లేక మా ఊరు వలసపోయే స్థితి వచ్చింద'ని చెప్తున్నారు. రైతుబంధు ఇవ్వటమే కాదు, కేసీఆర్ మాకు నీళ్లు కూడా ఇచ్చారంటున్నారు. మాకు ఇప్పుడు నీళ్లు కావాలని కన్నీళ్లతో మొర పెట్టుకుంటున్నారు.

> **ఇది రేఖామాత్రంగా రెండు గ్రామాల్లో పంట పొలాల్లో క్షేత్రస్థాయిల్లో అధ్యయన కమిటీ దృష్టికివచ్చిన విషయాలు మాత్రమే కానీ, ఏ ఊరుకు ఫోన్ చేసి తెలిసినవారితో మాట్లాడినా పరిస్థితి మరింత దారుణంగా మారిందని చెప్తున్నారు. కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలంలో సుమారు 40 వేల ఎకరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్న సమాచారం ఉంది.**

నడిగూడెం మండలంలో కూడా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. లారీల్లో, ట్రక్కుల్లో, ధాన్యాన్ని మార్కెట్లకు పంపించాల్సిన ఈ సమయంలో పంట పొలాల్లోకి అదే ట్రక్కుల్లో మేత కోసం గొర్రెలను తోలుకరావటం గ్రామాల గుండెలను పిండేసేదిగా ఉన్నది. గత ఐదేండ్లుగా సమృద్ధిగా నీళ్లను పొందిన నేలలు ఈ ఏడాది ఎస్ఆర్ఎస్పీ ద్వారా నీళ్లందించలేకపోవటంతో వరి పంట నేలపాలైంది. నీటి నిర్వహణలో వైఫల్యమే నీళ్లందక నోటికాడికొచ్చిన పంట ప్రాణాలు తీసినట్లయ్యింది. ఇది రాజకీయ అంశం కాదు. ఇది రైతుల సామూహిక గోస. గుక్కపెట్టి ఏడుస్తున్న రైతుల కన్నీటి గాథ. తెలంగాణ పల్లె మళ్లీ కన్నీరు పెడుతున్న యదార్థ కథ. పంటల మరణమంటే అది రై తుల జీవన్మరణమే. గ్రామం తిరిగి విధ్వంసం వైపు వెళ్లటమే. రాజకీయ భేషజాలను వీడి రైతు కంటిపాపగా ప్రభుత్వం నిలవాలి. పాలకుడు ప్రజలను బిడ్డలుగా భావించి వాళ్లను బతికించాలి. గుండె ధై ర్యాన్నివ్వాలి. వారికి అండగా ఉండాలి. అవసరమైతే యుద్ధ ప్రాతిపదికన పంటల నష్టాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి సహా మొ త్తం ప్రభుత్వం కదిలి ఆ పంట క్షేత్రాలను చూడాలని రైతులు కోరుతున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించమంటున్నారు. ఈ పని తక్షణం చేయకపోతే రైతులకు తీరని నష్టం చేసినవాళ్లవుతారు. అన్నం పెట్టే రైతు ను అత్యవసరంగా ఆదుకోవటం కంటే ముఖ్యమైన పని మరొకటుండదు. కాబట్టి, రైతులకు అండగా నిలుస్తామని నిరూపించుకోండి.




# కొంపలు ముంచే పెన్షన్ సవరణ!

> **'పెన్షన్' అనేది సామాజిక భద్రతా పథకం. శ్రమనే పెట్టుబడిగా పెట్టి జీతంతో కడుపు నింపుకొనే ఉద్యోగులు వయసు పైపడటం వల్ల ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పేదరికంలోకి వెళ్లిపోకుండా కాపాడేది. మన దేశం శ్రేయో రాజ్యం. ఈ శ్రేయో రాజ్యంలో ప్రజల శ్రేయస్సును కాపాడే బాధ్యత ప్రభుత్వాలది. ఆ ప్రభుత్వాలు పెన్షన్ భారం నుంచి బయటపడటానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే రెండు దశాబ్దాల కిందట వాజపేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి కొత్తగా జాతీయ పెన్షన్ విధానాన్ని తెచ్చింది.**

'కొత్త పెన్షన్ వద్దు– పాత పెన్షన్ ముద్దు' అని ఉద్యోగులు, పెన్షనర్లు రెండు దశాబ్దాలుగా ఆందోళన చేస్తుంటే పాలకులు పట్టించుకోవడం లేదు. మళ్లీ అదే బీజేపీ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి బదులుగా కొత్త పెన్షన్ విధానంలో కొన్ని మార్పులు తెస్తూ 2025, ఏప్రిల్ 1 నుంచి అమలయ్యే యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని తెచ్చింది. అంతేకాకుండా పాత పెన్షన్ దారులకు హాని చేసే మరో బిల్లును 2025–2026 ఆర్థిక బిల్లులో భాగంగా గుట్టుచప్పుడు కాకుండా లోక్‌సభ ఆమోదించింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఒక వైపు ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే మరోవైపు పెన్షన్‌దారులకు నష్టదాయకంగా ఉండేవిధంగా లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లును త్వరలోనే రాజ్యసభలో ఆమోదింపజేసుకుంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టమవుతుంది. పెన్షనర్లను పాత, కొత్త పెన్షనర్లుగా విడదీయడం ఈ బిల్లులోని ముఖ్య విషయం.

ఈ బిల్లులోని సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వ పౌర సేవల (సివిల్ సర్వీసెస్) పెన్షన్ నిబంధనలు 1972, 2021 అసాధారణ (ఎక్స్‌ట్రార్డినరీ) పెన్షన్ నిబంధనలు 2023లో మార్పులు వస్తాయి. కొత్త సవరణల ద్వారా వేతన సవరణల ఫలితంగా వచ్చే లాభాలను వేతన సవరణ కమిషన్ సిఫారసులు అమలైన తేదీ తర్వాత పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే వర్తిస్తాయి. ఆ తేదీకి ముందు రిటైరైన పింఛనర్లకు పే కమిషన్ సిఫారసు చేసిన లాభాలు వర్తించవు. పే కమిషన్ సిఫారసులను ఎప్పుడు ఎలా అమలుచేయాలో నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దీని ద్వారా పెన్షన్ హక్కులు ఎవరికి వర్తించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సవరణ సంఘం సిఫారసులు 2026 జనవరి 1 నుంచి అమలు చేయవలసి ఉన్నది. ఇప్పుడు ఈ చట్టం ద్వారా పెన్షనర్లు రెండు గ్రూపులు అవుతారు. అంటే 01-01-2026 ముందు పదవి విరమణ చేసిన వారు, తర్వాత పదవీ విరమణ చేసినవారు. అట్లే ఈ చట్టం ద్వారా వేతన కమిషన్ అమలుచేసిన తేదీ లేదా కేంద్రం నిర్ణయించిన తేదీ ప్రకారం... పదవీ విరమణ చేసినవారికి మాత్ర మే ఆర్థిక లాభం చేకూరుతుంది. మిగిలినవారికి ఆర్థిక లబ్ధి ఉండదు. వారికి ప్రస్తుతం పొందుతున్న పెన్షన్ మాత్రమే వస్తుంది. అట్లే ఒక కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ 01.03.2025న పదవీ విరమణ చేశారు, కానీ కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘ సిఫారసులు 01.01.2026 నుంచి అమలుచేస్తే, ముందు పదవీ విరమణ చేసినవారు ఎవరికి ఈ చట్టం ప్రకారం ఆర్థిక లబ్ధి జరుగదు. అంటే 1.1.26 తదుపరి పదవీ విరమణ చేసినవారికి మాత్రమే వేతన సంఘం సిఫారసుల లబ్ధి వర్తిస్తుంది.

పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా వేరు చేయడం అసమంజసమని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ సవరణ బిల్లు ద్వారా ప్రభుత్వం ఆ తీర్పును నిర్వీర్యం చేస్తూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా నిర్ణయించడానికి ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్నది. ఈ బిల్లు చట్టరూపంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తే, రాష్ట్రాలు కూడా అమలుచేస్తాయి. ఫలితంగా మన రాష్ట్రంలోని పెన్షనర్లు కూడా తీవ్రంగా నష్టపోతారు. కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా నుంచి పెన్షన్ పొందుతున్న పెన్షనర్లకు ఈ మార్పు వర్తిస్తుందని బిల్లులో పేర్కొన్నారు. కొంతమంది ఈ చట్టం న్యాయపరంగా చెల్లదని సీనియర్ పెన్షనర్లకు తక్కువ పెన్షన్, జూనియర్లకు ఎక్కువ పెన్షన్ వచ్చే అవకాశం ఉండటం వల్ల పెన్షన్ అనామలీలు ఏర్పడుతాయనుకుంటున్నారు. కానీ, కేంద్రం బిల్లులో ఈ అంశాన్ని కూడా ప్రస్తావించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను ఉటంకిస్తూ పెన్షన్ చెల్లింపు అనేది డిఫర్డ్ వేజ్‌గా గుర్తిస్తున్నామని, అందుకే పెన్షన్ చెల్లింపు ఉన్నదని పేర్కొంటూనే, 1950, 1960,1970లలో పనిచేసిన ఉద్యోగికి 1986లో పెన్షన్ చెల్లించాల్సిన అవసరం ఏమిటని, ఉద్యోగి పనిచేసిన కాలపు డిఫర్డ్ వేజ్‌ను పెన్షన్‌గా ఇప్పటికే ఆ పెన్షనర్‌కు చెల్లిస్తున్నారు. కనుక పెన్షన్ పెంపుదల అవసరం లేదని బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారు.

> **ప్రభుత్వం పెన్షన్ పెరుగుదల అంశాన్ని మరింత విశదీకరిస్తూ మూడో వేతన సంఘం నుంచి ఇప్పటి 7వ వేతన సంఘం దాకా పెన్షన్ పెరుగుదలపై విస్తృత చర్చ జరగాలని అన్ని వేతన సంఘాలు చెప్పాయని, కనుక ఇకపై వేతన సంఘం ఏర్పాటు తర్వాత ఆయా సిఫారసులను అమలుచేయాల్సిన తేదీ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి మాత్రమే వేతన సంఘం సిఫారసులు వర్తిస్తాయని, అంతకుముందు రిటైర్ అయినవారికి కాదని పేర్కొన్నారు. ఫైనాన్స్ బిల్లుపై సంపూర్ణ అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉండటం, న్యాయ పరిధిలో చాలెంజ్‌కు నిలబడే అవకాశాలు తక్కువ ఉండటం ఈ సందర్భంగా గమనించాలి.**

లోక్‌సభలో ప్రశ్న సంఖ్య 235కు సమాధానం ఇస్తూ 61 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ సివిల్ పెన్షనర్లకు, డిఫెన్స్ పెన్షనర్లకు 8వ వేతన సవరణ కమిషన్ సిఫారసులను వర్తింపజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం తాను ఇచ్చిన హామీకి భిన్నంగా ఈ సవరణ బిల్లును తేవడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు పన్నులను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికి పన్నును 15 శాతానికి తగ్గించింది. దీంతో ఏడాదికి రూ.1.5 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. కార్పొరేట్లకు బ్యాంకుల్లో పేరుకుపోయిన బకాయిలను రూ.17 లక్షల కోట్ల వరకు మాఫీ చేసింది. కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఇన్సెంటివ్ రూపేణా రూ.2 లక్షల కోట్లు ఇచ్చింది. పెట్టుబడిదారులను సంతృప్తిపరిచేందుకు ఇంత డబ్బు వినియోగించే ప్రభుత్వాలు పెన్షనర్ల కడుపు కొట్టడానికి సిద్ధం కావడం శోచనీయం. 'ఉన్ని బట్టలు ఇమ్మంటే ఉన్న బట్టలే పీకేసినట్టు' నేడు మోదీ ప్రభుత్వం ఉద్యోగుల సమంజస డిమాండ్లన్నింటినీ బేఖాతరు చేస్తూ, ఓపీఎస్ పెన్షన్ దారుల హక్కులను కూడా హరించివేస్తూ ఈ చట్ట సవరణకు శ్రీకారం చుట్టింది. పెన్షన్లకు కోతలు పెట్టే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెన్షనర్లతోపాటు, అఖిల భారత స్థాయిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వసంస్థల ఉద్యోగులు సంఘటితమై దేశవ్యాప్తంగా సుదీర్ఘ సమరాన్ని సాగించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.



**కె.వేణుగోపాల్**
**9866514577**

**(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)**